ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 30.0 | కనిష్ఠం : 17.0
ANDHRAJYOTHY


## ఆరు ఇళ్లలో చోరీ

వెల్దండ, జనవరి 20 : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని పల్గుతండాలో శుక్రవారం రాత్రి ఆరు ఇళ్లలో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పల్గుతండాలో ఇళ్లతాళాలు పగులగొట్టి ఇంట్లోకి చొరబడి దొంగలు చోరీకి పాల్పడ్డారు. తమ వ్యక్తిగత పనుల నిమిత్తం ఇతర గ్రామాలకు వెళ్లిన నేనావత్ కంసి ఇంట్లో మూడు తులాల బంగారం, హేమ్లా ఇంట్లో రూ.30 వేల నగదు, మీరి ఇంట్లో రూ.10 వేలు నగదును దొంగిలించారు. అదేవిధంగా మరో మూడు ఇళ్లలో చోరీకి యత్నించారు. నేనావత్ కంసి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని సీఐ సోమనర్సయ్య, ఎస్ఐ శ్రీనివాస్‌లు క్లూస్‌టీంతో సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు.

# కిట్లు సరే.. డబ్బులేవీ?

- మూడేళ్ల నుంచి కేసీఆర్ కిట్ నిధులు విడుదల బంద్
- కిట్లు ఇస్తున్నప్పటికీ.. డబ్బులు ఇవ్వని రాష్ట్ర ప్రభుత్వం
- వనపర్తిలో రూ. 16.45కోట్లు, గద్వాలలో రూ. 25.34కోట్లు
- కొత్త ప్రభుత్వంలో నిధులు విడుదల చేయాలని డిమాండ్


ప్రభుత్వాస్పత్రిలో చెకప్‌ల కోసం వేచి ఉన్న గర్భిణులు

వనపర్తి/గద్వాల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచడం, భ్రూణ హత్యలను నివారించడం కోసం గత ప్రభుత్వం 2017 సంవత్సరంలో కేసీఆర్ కిట్ పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకంలో భాగంగా శిశువుకు అవసరమైన వస్తువులను అందించడంతో పాటు.. ఆడశిశువు జన్మిస్తే రూ. 13వేలు, మగ శిశువు జన్మిస్తే రూ. 12వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. 2021 ప్రారంభం వరకు పథకం బాగానే నడిచినా.. ఆ తర్వాత నుంచి ఇప్పటివరకు గర్భిణులు, బాలింతలకు ఆర్థిక సాయం అందడం లేదు. నిధులు విడుదల చేయకపోవడంతో ప్రతీ జిల్లాలో రూ.కోట్లల్లో బకాయిలు పేరుకు పోయాయి. ప్రస్తుతం ప్రభుత్వం మారి.. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పెండింగ్ బకాయిలను విడుదల చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. 2021 నుంచి కేసీఆర్ కిట్ కింద వస్తువులతో కూడిన బ్యాగును అందజేస్తున్నప్పటికీ.. ఆర్థిక సాయం మాత్రం విడుదల కావడం లేదు. మొదటి కాన్పుకు సంబంధించిన పీఎం మాతృ వందన యోజన కింద రూ.5వేల వరకు వస్తుండగా.. దాన్ని గత ప్రభుత్వం రెండు డెలవరీలకు కూడా ఇచ్చేలా పథకాన్ని రూపొందించి సాయాన్ని పెంచింది. ఈ క్రమంలో ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు పెరగడంతోపాటు.. ఏఎన్‌సీ (యాంటినెంటల్ చెకప్)తో, ఫుల్ ఇమ్యూనైజేషన్ కూడా బాగా పెరిగింది. ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రసవాలు తగ్గిపోయాయి. అయితే మూడేళ్లుగా ఈ పథకం కింద నిధులు విడుదల కాకపోవడంతో మళ్లీ పూర్వ స్థితి వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం కేసీఆర్ కిట్‌కు బదులు పేరు మార్చి.. ఎంసీహెచ్ కిట్లను అందజేస్తుండగా.. నిధుల విడుదలపై మాత్రం ఇంకా నిర్ణయం తీసుకోలేదని చెప్పవచ్చు.

### రూ. కోట్లలో నిధులు పెండింగ్..

ఈ పథకం కింద ఆడపిల్ల పుడితే రూ. 13వేల చొప్పున, మగపిల్లాడు పుడితే రూ. 12వేల చొప్పున అందజేస్తారు. అవి కూడా నాలుగు విడతల్లో అందజేస్తారు. గర్భనిర్ధారణ జరిగిన తర్వాత రెండు ఏఎన్‌సీ చెకప్‌లు చేసుకుని.. రిజిస్ట్రేషన్ పూర్తయితే మొదటి విడతగా గర్భిణుల ఖాతాలో రూ. 3వేలు డిపాజిట్ చేస్తారు. ఆ తర్వాత ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవం చేసుకుంటే.. మగపిల్లాడు పుడితే రూ. 4వేలు, ఆడపిల్ల పుడితే రూ. 5వేల చొప్పున డిపాజిట్ చేస్తారు. ఆ తర్వాత మొదటి ఇమ్యూనైజేషన్‌లో రూ. 2వేల చొప్పున, ఫుల్ ఇమ్యూనైజేషన్ అంటే శిశువు జన్మించిన తొమ్మిది నెలల తర్వాత రూ. 3వేల చొప్పున డిపాజిట్ చేస్తారు. ఇవి విడతలవారీగా జరగాలి. కానీ మొదటి నుంచి వెంటవెంటనే కాకుండా డెలవరీ అయిన తర్వాత విడతలవారీగా నగదు బదిలీ చేసేవారు. 2021 తర్వాత అది కూడా పూర్తిగా ఆగిపోయింది. గద్వాల జిల్లాలో ఎన్‌సీ దశలో రూ.1.11కోట్లు, డెలవరీల దశలో రూ. 7.91కోట్లు, మొదటి ఇమ్యూనైజేషన్ దశలో రూ. 6.41 కోట్లు, ఫుల్ ఇమ్యూనైజేషన్ దశలో రూ. 9.91కోట్లు మొత్తం కలిపి రూ. 25.34కోట్లు 2021 నుంచి 2024 జనవరి వరకు పెండింగ్‌లో ఉన్నాయి. వనపర్తి జిల్లాలో కేసీఆర్ కిట్ పథకం ప్రారంభించినప్పటి నుంచి 74,223 మందికి రూ. 22.27 కోట్లు వారి ఖాతాల్లో జమ చేయగా.. 2021 నుంచి 56,305 మందికి రూ. 16.45కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తంగా ఈ పథకం కింద రెండు జిల్లాల్లో కలిపి దాదాపు రూ. 47 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. డబ్బులు వస్తాయని వేచిచూస్తున్న మహిళలు రోజూ ఖాతాలు చెక్ చేసుకోవడం తప్పా వేరే మార్గం కనిపించడం లేదు. 2021లో జన్మించిన శిశువు ప్రస్తుతం బడికి వెళ్లే దశకు చేరుకున్నప్పటికీ నగదు జమకాకపోవడం గమనార్హం. అయితే కొత్త ప్రభుత్వం ఈ విషయంపై తొందరగా దృష్టి పెట్టాలని మహిళలు కోరుతున్నారు.

### పూర్వ స్థితి వచ్చే ప్రమాదం..

ప్రభుత్వాస్పత్రులపై నమ్మకం పెంచడం, ప్రసవాలు పెరగడం, తద్వారా శిశు మరణాలను తగ్గించడం కోసం ఈ పథకం రూపొందించగా.. మొదట్లో ప్రభుత్వాస్పత్రులకు వెళ్లడానికి గర్భిణులు జంకారు. ఆ తర్వాత సౌకర్యాలు మెరుగుపడటం, జిల్లాల్లో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం, మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు కూడా ఏర్పాట య్యాయి. అలాగే కేంద్ర ప్రభుత్వం కూడా ఎన్‌హెచ్‌ఎం ( నేషనల్ హెల్త్ మిషన్) కింద భారీగా నిధులు విడుదల చేయడంతో ఒకప్పుడు ప్రైవేటులో ఎక్కువగా ఉండే ప్రసవాలు.. ప్రస్తుతం ప్రభుత్వాస్పత్రుల్లోనే ఎక్కువగా జరుగుతున్నట్లు గణంకాలు చెబుతున్నాయి. ఇందుకు పరోక్షంగా నగదు బదిలీ, కేసీఆర్ కిట్ దోహదం చేశాయి. అయితే మొదట్లో మంచిగానే నిధులు విడుదల చేసిన ప్రభుత్వం మూడేళ్లుగా నగదు బదిలీని పూర్తిగా ఆపేసింది. ప్రభుత్వం ఇచ్చే సాయం వివిధ దశల్లో ఇవ్వడం వల్ల ఏఎన్‌సీ చెకప్ చేసుకునేవారి సంఖ్య, మొదటి, ఫుల్ ఇమ్యూనేజషన్ చేసుకునేవారి సంఖ్య కూడా భారీగా పెరిగింది. ఒకవేళ ఏఎన్‌సీ చెకప్ చేసుకుని, డెలవరీ ప్రైవేటులో చేసుకున్నప్పటికీ.. డెలవరీ మినహా మిగతా అన్నింటికీ మహిళల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాయి. దీనివల్ల శిశు మరణాలు భారీగా తగ్గిపోయాయి. పలు సందర్భాల్లో అన్ని రాష్ట్రాల కంటే దేశంలో ఏఎన్‌సీ, డెలవరీల్లో, చైల్డ్ మోర్టాలిటీని నివారించడంలో రాష్ట్రం ముదుంజలో కొనసాగింది.

ప్రస్తుతం కూడా ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు ఎక్కువగానే జరుగుతున్నప్పటికీ.. నగదు బదిలీలాంటి పథకాలు ఉండటం వల్ల ఇంకా మెరుగైన వైద్యసేవలు మహిళలు పొందడానికి అవకాశం ఉంటుంది. లేకపోతే ఏఎన్‌సీ, ఇమ్యూనైజేషన్‌కు ప్రభుత్వం కంటే ప్రైవేటుకు మొగ్గుచూపే అవకాశం ఉంది. దీనివల్ల ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడటంతోపాటు.. ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

## ఆస్పత్రుల్లో.. వసతులు కల్పించండి

**- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**

నాగర్‌కర్నూల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : వైద్య కళాశాలకు సంబంధించి వచ్చే అకాడమిక్ సంవత్సరంలో విద్యార్థులకు మౌలిక వసతులు సమకూరుస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లాలోని వైద్య కళాశాలను రాష్ట్ర అబ్కారీ, సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లాలోని శాసన సభ్యులు, కలెక్టర్‌తో కలిసి మంత్రి పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాల భవనాన్ని పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ప్రస్తుతం కళాశాలలో ఉన్న మౌలిక వసతులు, వచ్చే విద్యా సంవత్సరానికి అవసరమైన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా ఏర్పడిన నాగర్‌కర్నూల్ వైద్య కళాశాలలో వచ్చే అకాడమిక్ సంవత్సరంలో మరికొంత మంది వైద్య విద్యార్థులు చేరనున్నందున అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అంతకు ముందు జిల్లా ఆసుపత్రిని సందర్శించి అక్కడ ఉన్న మౌలిక వసతులు, రోగులకు అందిస్తున్న వైద్య సదుపాయం, భోజనాన్ని పరిశీలించారు. ఆసుపత్రి ఎమర్జెన్సీ, జనరల్ వార్డులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్యం అందిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, ఆసుపత్రిలో చాలా ఇరుకుగా ఉన్నందున వాటిని మెరుగుపర్చడానికి నిధుల ఆవశ్యకతపై ఆలోచిస్తామన్నారు. ఇక్కడ ట్రామా యూనిట్‌కు అవసరమైన సిబ్బంది, నిధులపై త్వరలో కార్యాచరణ చేపడుతామని తెలిపారు. ఆసుపత్రిలో అన్ని సాంకేతిక మిషనరీలు ఉన్నాయి కానీ ఐసీయూలో సాంకేతిక నైపుణ్యం కలిగిన సిబ్బంది కొరత వల్ల పూర్తిస్థాయి వైద్యం అందడం లేదని కలెక్టర్ పీ ఉదయ్ కుమార్ మంత్రి దృష్టి తీసుకొచ్చారు. స్పందించిన మంత్రి త్వరలో చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. రాష్ట్ర అబ్కారీ సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, కశిరెడ్డి నారాయణరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ శాంతాకుమారి, కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

# ఫైళ్లు మాయం

- భూసేకరణ కార్యాలయంలో కోర్టు కేసు ఫైళ్లు ఆచూకీ కరువు
- ప్రైవేటు వ్యక్తులతో కుమ్మక్కై మాయం చేశారని ఆరోపణలు
- తద్వారా కోర్టు కంటెప్ట్ అయ్యి డబ్బులు కాజేశారనే విమర్శ
- కొన్నిరోజుల క్రితం ఫైళ్ల ఆచూకీపై విచారణ.. డీటీ సస్పెన్షన్
- తాజాగా ఆరుగురు ఔట్‌సోర్సింగ్ సిబ్బందిపై కేసు నమోదు

వనపర్తి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వనపర్తి భూసేకరణ కార్యాలయంలో ఫైళ్లు మాయమయ్యాయి. జిల్లాల విభజన సమయంలో భూసేకరణకు సంబంధించిన వివరాలు, భూములు కోల్పోయిన రైతులకు వచ్చిన పరిహారానికి సంబంధించిన అవార్డు కాపీలు.. వారికి అందిన పరిహారం వివరాల ఫైళ్లు ఆయా కొత్త జిల్లాల వారీగా విభజించారు. వనపర్తి జిల్లాకు సంబంధించి జూరాల, కల్వకుర్తి, భీమా ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన అన్ని ఫైళ్లు అందినట్లు ఇన్‌వార్డులో ఎంట్రీలు కూడా చేసుకున్నారు. అయితే కొన్నిరోజుల క్రితం కొన్ని ఫైళ్లు కనిపించడం లేదని, అవి ఎక్కడ ఉన్నాయో దొరకడం లేదని ఫిర్యాదులు అందడంతో ఉన్నతాధికారులు.. ఆ శాఖకు సంబంధించి అంతర్గత విచారణకు ఆదేశించారు. కొందరు కలెక్టరేట్ ఉద్యోగులను ఇందులో భాగస్వాములు చేయగా.. వారి జిల్లాకు సంబంధించిన అన్ని భూ సేకరణ, పరిహారం, కోర్టు కంటెప్ట్‌కు సంబంధించిన ఫైళ్లను వడపోసిన తర్వాత కొన్ని ఫైళ్లు దొరకడం లేదని ఉన్నతాధికారులకు నివేదిక అందించారు. ఈ క్రమంలో ఆ రికార్డులు పర్యవేక్షిస్తున్న ఒక డిప్యూటీ తహసీల్దార్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. తాజాగా ఇదే విషయంలో వనపర్తి భూసేకరణ కార్యాలయ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అందులో ఆరుగురు ఔట్‌సోర్సింగ్ సిబ్బందిపై కేసు నమోదు చేయాలని పేర్కొనట్లు తెలుస్తోంది. ఈ మేరకు పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. అయితే అత్యంత కీలకమైన శాఖలో ఫైళ్లు మాయం కావడంపై తీవ్రమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ శాఖలో పనిచేసే కొంతమంది సిబ్బంది దురాశకు అలవాటుపడి ఫైళ్లు మాయం చేశారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అత్యంత కీలకంగా ఉంచాల్సిన రికార్డులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడంతో.. ప్రభుత్వ సొమ్మును కాజేసినట్లు తెలుస్తోంది. పూర్తిస్థాయి విచారణ చేసి.. బాధ్యులను కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉంది.

### ప్రైవేటు వ్యక్తుల కుమ్మక్కుతోనే...

వివిధ ప్రాజెక్టులకు అవసరమైన భూములను సేకరించినప్పుడు ప్రభుత్వం భూసేకరణ చేయడం సర్వసాధారణం.. ప్రభుత్వం నిర్దేశించిన రేటు ప్రకారం ఆ భూములకు ధర చెల్లించి.. అవి స్వాధీన పర్చుకుని ప్రాజెక్టులను నిర్మిస్తారు. అయితే సదరు భూసేకరణ కు సంబంధించిన పరిహారం సరిపోకపోతే.. భూమి కోల్పోయిన వ్యక్తులు కోర్టుల్లో కేసులు వేసుకుని.. ప్రభుత్వం సమ్మతిస్తే.. మరింత పరిహారం పొందుతారు. అయితే భూ సేకరణ చేసే సమయంలో అవార్డు కాపీలు.. పరిహారం చెల్లించినట్లు రికార్డులు కచ్చితంగా నిర్వహించాల్సి ఉంటుంది. ఒకవేళ పరిహారం పొందిన వ్యక్తి మళ్లీ తనకు పరిహారం రాలేదని కోర్టులో కేసు వేస్తే.. సంబంధిత ఫైళ్లు భద్రపర్చడం వల్ల ఆ వివరాలు కోర్టుకు అందజేస్తే.. కోర్టు కంటెప్ట్ కాకుండా ఉంటుంది. బోగస్‌గా పరిహారాలను పొందే వారిని అరికట్టవచ్చు. కానీ భూసేకరణ కార్యాలయంలో కొందరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు.. ప్రైవేటు వ్యక్తులు ఇచ్చే డబ్బులకు ఆశపడి.. పరిహారం పొందిన వివరాలు, అవార్డు కాపీలకు సంబంధించిన ఫైళ్లను సదరు ప్రైవేటు వ్యక్తులకు అప్పగించినట్లు ఆరోపణలు వెలువడుతున్నాయి. సదరు ప్రైవేటు వ్యక్తులు ఆ ఫైళ్లను దగ్గర ఉంచుకుని.. మళ్లీ భూమి కోల్పోయిన వ్యక్తులతో తమకు పరిహారం రాలేదని కోర్టులో కేసులు వేయించినట్లు తెలుస్తోంది. అప్పుడు కోర్టు అధికారులను వివరాలు అడిగితే సదరు ఫైళ్లను కోర్టు ఎదుట దాఖలుపర్చవల్సి ఉండగా.. అవి కార్యాలయం నుంచి మాయం కావడం వల్ల.. కోర్టు అడిగిన వివరాలు ఇవ్వకపోవడం.. సమాధానం చెప్పకపోవడం.. ఒకవేళ మిస్ అయితే పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎఫ్ఐఆర్ కాపీ కూడా అందజేయకపోవడంతో కోర్టు కంటెప్ట్ అయ్యి.. పరిహారం పొందిన వ్యక్తులకే ఫైళ్లు మిస్ అయిన కారణంగా చాలా కేసుల్లో తిరిగి మళ్లీ పరిహారం వచ్చినట్లు తెలుస్తోంది. ఫైళ్లు మాయం అయినప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేసి.. అప్పుడే కాపీలు కోర్టు ఎదుట దాఖలు చేస్తే.. ఇబ్బంది ఉండేది కాదు.. కానీ చాలా ఫైళ్లు మిస్ కావడం వల్ల కొన్నాళ్లుగా అంతర్గతంగా మథనం జరుగుతోంది. కొన్ని రోజుల కింద జరిగిన విచారణలో కూడా ఫైళ్లు మాయం అయినట్లు తేలింది. ఇప్పుడు ఏం చేయలేని పరిస్థితుల్లో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మొన్నటి వరకు ఆ శాఖలో దాదాపు 10 మంది వరకు ఔట్ సోర్సింగ్ సిబ్బంది పనిచేయగా.. ప్రస్తుతం ఇద్దరు మాత్రమే పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. మిగతావారిని ఎన్నికల సమయంలోనే రావొద్దని చెప్పినట్లు సమాచారం. అయితే కొందరు కీలకమైన అధికారులు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ద్వారా తప్పులు చేయించి.. వారు తప్పించుకున్నట్లు తెలుస్తోంది. చాలా ఏళ్లుగా పాతుకుపోయిన వారే ఈ ఘనకార్యం చేసినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. ఇదే విషయమై వనపర్తి ఎస్‌డీసీ వెంకటేశ్వర్లును ఫోన్‌లో సంప్రదించగా.. ఆయన అందుబాటులోకి రాలేదు.

# అవిశ్వాసం టెన్షన్

- గడువు ఉండటంతో నాయకులకు వదులుతున్న చేతి చమురు
- కౌన్సిలర్‌ను కాపాడుకునేందుకు ఇరుపార్టీలకు తలనొప్పిగా వ్యవహారం
- 27న అవిశ్వాస తీర్మానం.. తరువాత కొత్త చైర్మన్ ఎన్నికకు మళ్లీ గడువు
- నేడు విహార యాత్రకు ఇరు శిబిరాలు



పాలమూరు పురపాలిక కార్యాలయం

మహబూబ్‌నగర్, జనవరి 20: పాలమూరు పురపాలికలో అవిశ్వాస తీర్మానం గడువు సమీపిస్తున్న కొద్దీ చైర్మన్ పదవికి పోటీపడే వారిలో టెన్షన్ పెరిగిపోతోంది. చైర్మన్‌ను ఎన్నుకునే కౌన్సిలర్‌లు మాత్రం మనకు టైమ్ వచ్చిందని పండగ చేసుకుంటున్నారు. ఈ నెల 27న పురపాలిక చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ ఉన్న సంగతి తెలిసిందే. అవిశ్వాస తీర్మానానికి అన్ని పార్టీలు మద్దతుగా నిలవడంతో నెగ్గడం లాంఛనమే. ఇక ఆ తరువాత కొత్తగా చైర్మన్, వైస్ చైర్మన్ ఎవరనేదానిపైనే అందరిలో ఉత్కంఠ నెలకొంది. కాంగ్రెస్ నుంచి ఆనంద్‌కుమార్‌గౌడ్, బీఆర్‌ఎస్ నుంచి కోరమోని వనజ చైర్మన్‌కు పోటీపడుతున్నారు. వైస్ చైర్మన్ విషయంలో రెండు పార్టీలలో స్పష్టత రాలేదు.. ఈ నెల 5న 30 మంది సభ్యులు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని కలెక్టర్‌కు తీర్మాన కాపీని అందించారు. 10న కౌన్సిలర్‌కు నోటీసులు జారీ చేశారు. 27న చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాస తీర్మానం ఓటింగ్ నిర్వహించనున్నట్లు నోటీసులో పేర్కొన్నడంతో పుర రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. మధ్యలో సంక్రాంతి రావడంతో కొంత హడావుడి తగ్గినా పండగ తరువాత రాజకీయం హీటెక్కుతోంది. కాంగ్రెస్‌కు మద్దతిస్తున్న విపక్షాలతోపాటు బీఆర్‌ఎస్ చీలిక కౌన్సిలర్‌లను కాపాడుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నాలు చేస్తుంది. బీఆర్‌ఎస్‌లో ఉన్న సభ్యులను కాపాడుకుంటూనే అసంతృప్తిగా ఉన్న కౌన్సిలర్‌లను బుజ్జగించే ప్రయత్నాలు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు చేస్తున్నారు. కౌన్సిలర్‌లకు ఇప్పటికే నయానా, భయాన చెప్పుకున్నా చివరికి శిబిరంలో ఎంత మంది ఉంటారన్న టెన్షన్‌తో బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీ, ఎంఐఎం సభ్యులతోనూ మంతనాలు సాగిస్తున్నారు. కాంగ్రెస్ మాత్రం బీజేపీ, ఎంఐఎం తమవైపే ఉన్నారని, బీఆర్‌ఎస్‌లో తమకు మద్దతు ఇచ్చిన ఆ పార్టీ అసంతృప్త కౌన్సిలర్‌లను చేజారిపోకుండా చూసుకునే ప్రయత్నంలో ఉంది. ఈ నేపథ్యంలో ఇరు పార్టీలకు చెందిన నాయకులు కౌన్సిలర్‌లను విహారయాత్రల పేరుతో విందులు ఇచ్చే పనిలో పడ్డారు. కాంగ్రెస్ నాయకులు ఇప్పటికే ఓమారు టూర్‌కు వెళ్లి రాగా, నేడు మరో ప్రాంతానికి కౌన్సిలర్‌లను తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. బీఆర్‌ఎస్ నాయకులు కూడా నేడు కౌన్సిలర్‌లను టూర్‌కు తీసుకెళ్లేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇలా ఇరుపార్టీలు ఇప్పటినుంచే క్యాంప్ రాజకీయాలకు తెరతీయడంతో చైర్మన్ పదవికి పోటీలో ఉన్న నాయకుల చేతిచమురు వదలుతోంది. 27న అవిశ్వాస తీర్మానం తరువాత మళ్లీచైర్మన్,వైస్ చైర్మన్‌లను ఎన్నుకునేందుకు గడువు ఇవ్వనున్నారు. అవిశ్వాసం అయిపోయిన వెంటనే మద్దతుదారులతో ఇరుపార్టీలు క్యాంప్‌కు వెళ్లాల్సిందే. అయితే ఆ గడువు తక్కువగా ఉండేలా పార్టీలు ప్రయత్నాలు చేస్తున్నాయి. వెంటనే ఎన్నిక నిర్వహిస్తే బాగుంటుందని, ఎక్కువ సమయం ఉంటే క్యాంప్ రాజకీయంతో కౌన్సిలర్‌లను కాపాడుకోవడం కష్టమవుతుందన్న టెన్షన్ అందరిలో ఉంది. బీఆర్‌ఎస్ మాత్రం విప్‌జారీ చేసి తమ పార్టీ కౌన్సిలర్‌ను చేజారిపోకుండా చూసుకునేందుకు సిద్ధమవుతోంది. విప్ పేరుతో పదవిపోతుందని బెదిరించే ప్రయత్నం చేస్తుండగా, విప్ జారీచేసినా అధికారంలో ఉన్నందున మీ పదవికి వచ్చే నష్టమేమీ లేదని అధికార పార్టీ భరోసా ఇస్తోంది.



## కొల్లూర్‌లో సామూహిక షష్టిపూర్తి

నవాబ్‌పేట, జనవరి 20: మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని కొల్లూర్ గ్రామంలో చింతలపూరి చిన్మయస్వామి ఆధ్వర్యంలో షష్టిపూర్తి కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 200మంది దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పీఠాధిపతి నందీశ్వరస్వామి షష్టిపూర్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశైలం పీఠాధిపతి డాక్టర్ చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామి సూచన మేరకు మల్లపూడి రవిచంద్ర ప్రవచనాలు చేశారు. షష్టిపూర్తి కార్యక్రమం ఆవశ్యకథ వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సౌజన్య రఘు, సుధీర్ రెడ్డి, లంబ వెంకటయ్య, ఖాజ, వాసు యాదవ్, గోపాల్ గౌడ్, చంద్రమోహన్, సత్యనారాయణ గౌడ్, చంద్రమోహన్ పాల్గొన్నారు.


సామూహిక షష్టిపూర్తి కార్యక్రమంలో దంపతులు

## ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

**- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆరో తరగతి పరీక్షకు హాజరైన 5,128 మంది విద్యార్థులు**


నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఈవో

బిజినేపల్లి/నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 20 : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన వట్టెం జవహర్ నవోదయ విద్యాలయం ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని ప్రిన్సిపాల్ పి.భాస్కర్ కుమార్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 2,294 మందికి గాను 1,866 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వగా, 428 మంది గైరాజరు అయ్యారు. జోగులాంబ గద్వాల జిల్లాలో 838 మందికి గాను 726 మంది హాజరవ్వగా 112 మంది హాజరు కాలేదు. నారాయణపేట జిల్లాలో 614 మందికి గాను 396 మంది హాజరవ్వగా 218 పరీక్ష రాయలేదు. వనపర్తిలో 1,046 మందికి గాను 817 మంది రాయగా, 229 హాజరవ్వలేదు. వికారాబాద్‌లో 189 మందికి గాను 149 పరీక్ష రాయగా 40 మంది గైరాజరు అయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 1,227 మందికి గాను 914 మంది పరీక్ష రాస్తే 313 మంది రాయలేదు. రంగారెడ్డి జిల్లాలో 394 ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా 260 మంది మాత్రమే పరీక్షకు హాజరై 134 మంది హాజరు కాలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 26 పరీక్ష కేంద్రాల్లో 6,602 మంది విద్యార్థులకు గాను 5,128 మంది పరీక్షకు హాజరు కాగా, 1,474 మంది గైరాజరయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బిజినేపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా విద్యాధికారి గోవిందరాజులు, జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి రాజేశేఖర్‌రావు పట్టణంలోని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

# అసభ్యంగా వ్యవహరించిన వ్యక్తిపై కేసు

మహమ్మదాబాద్ జనవరి 20 : ఓ మహిళ పట్ల అసభ్యంగా వ్యవహరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు మహమ్మదాబాద్ ఎస్ఐ సురేష్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండల పరిధిలోని సంగాయాపల్లి తండాకు చెందిన మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గత కొద్ది రోజులుగా నిత్యం వెంబడిస్తున్నాడని, శనివారం మధ్యాహ్నం రెండుగంట ప్రాంతంలో రమేష్ అనే వ్యక్తి ఇంటి వద్దకు వచ్చి చేయి పట్టి లాగి అసభ్యంగా ప్రవర్తించాడని, బూతు మాటలు కూడా తిట్టాడని ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు.

## ఫెన్సింగ్ వైర్ అపహరణ

మహమ్మదాబాద్ జనవరి 20 : వైకుంఠధామానికి ఉంచిన ఫెన్సింగ్ వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారని గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటమ్మ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండల పరిధిలోని వెంకట్‌రెడ్డిపల్లి గ్రామంలో ఉన్న వైకుంఠధామంని చుట్టూ వేసిన ఫెన్సింగ్ వైరును దొంగిలించినట్లు ఫిర్యాదు వచ్చిందని, ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

## 'సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి'

నవాబ్‌పేట, జనవరి 20 : గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహ రాజ్ జయంతి ఫిబ్రవరి 15ను ప్రభుత్వం అధికారిక సెలవు దినంగా ప్రకటించాలని ఆ సంఘం నాయకులు విస్లావత్ చందర్ నాయక్, శంకర్ నాయక్, నీల్యానా యక్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సేవాలాల్ ఉత్సవాలకు రూ.కోటి నిధులు కేటాయించాలని కోరారు. సోమవారం ఉదయం మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో జరిగె సమావేశానికి అందరు హాజరు కావాలని వారు కోరారు.

## సొసైటీలకు మాఫీ బడ్జెట్‌ను విడుదల చేయాలి

జడ్చర్ల, జనవరి 20 : సొసైటీలకు రావలసిన మాఫీ బడ్జెట్‌ను వెంటనే విడుదల చేయాలని ఉమ్మడి పాలమూరు జిల్లా పీఏసీఎస్ చైర్మన్‌ల ఫోరం ప్రధాన కార్యదర్శి సుదర్శన్ గౌడ్ కోరారు. టీఎస్ సీఏబీ మేనేజింగ్ డైరెక్టర్‌కు ఫోరం అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డితో పాటు శనివారం ఓ లేఖ రాశారు. ఆ ప్రతులను జడ్చర్లలో విలేకరులకు అందజేశారు. పంట పొలాలను బ్యాంకులో మార్టిగేజ్ చేసి దీర్ఘకాలిక రుణాలను తీసుకుందామనుకున్న రైతుల ఆశలపై డీసీసీబీ బ్యాంకు నీళ్లు చల్లుతోందని పేర్కొన్నారు. గత సంవత్సరం 50శాతానికి పైగా దీర్ఘకాలిక రుణాలను వసూలు చేస్తే, ఆ బ్యాంకు బ్రాంచీలకు, సింగిల్‌విండోలకు నూతనంగా దీర్ఘకాలిక రుణాలు ఇచ్చే వెసులుబాటు ఉండేదని వివరించారు. డీసీసీబీ బ్యాంకులో 12 మంది డైరెక్టర్‌లతో పాటు నాబార్డ్, టీఎస్ సీఏబీ లాంటి సంస్థలలో అనుభవం ఉన్న వ్యక్తిని ప్రొఫెషనల్ డైరెక్టర్‌గా నియమిస్తారని, డైరెక్టర్స్ ఆఫ్ బోర్డులో కీలకంగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. కొన్ని అంశాలలో బోర్డు డైరెక్టర్స్‌కు, ప్రొఫెషనల్ డైరెక్టర్ మధ్య బేధాలు వచ్చాయని, ప్రొఫెషనల్ డైరెక్టర్‌ను తొలగించాలంటూ చేసిన తీర్మానాన్ని చైర్మన్, సీఈఓలు గత నెల టీఎస్ సీఏబీ పంపారని వివరించారు. దీంతో రుణాలకు దరఖాస్తు చేసుకున్న రైతులకు రుణాలు ఇవ్వలేని పరిస్థితి అయ్యిందని పేర్కొన్నారు. దీర్ఘకాలిక రుణాలకు ఇచ్చే రీఫైనాన్స్ విడుదల చేయించి, రైతులను ఆదుకోవాలని కోరారు.

## కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), జనవరి 20 : తెలంగాణ కార్మిక సంక్షేమ మండలి కింద అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో భాగంగా దుకాణాలు, వాణిజ్య సంస్థలు, కర్మాగారాలు, మోటారు రవాణా సంస్థలు, సహకార సంస్థలు, ధార్మిక లేదా ఇతర ట్రస్టులలో పని చేస్తున్న కార్మికుల పిల్లలు, కార్మికులకు 2022-23 విద్యా సంవత్సరంలో ఉపకార వేతనాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు తెలంగాణ కార్మిక సంక్షేమ మండలి ఇన్‌చార్జ్ సంక్షేమ కమిషనర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 10వ తరగతి మొదలుకొని ఐ.టి.ఐ., పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, మెడిసిన్, లా, బీ.ఎస్.సి (అగ్రికల్చర్), బీఎస్సీ(వెటర్నరి), బీఎస్సీ(నర్సింగ్), బీఎస్సీ(హార్టికల్చర్), బీసీఏ, ఎంసీఏ, బి.ఫార్మసి, ఎంఫార్మసి, బీబీఏ, ఎంబీఏ, డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబరేటరీ టెక్నీషియన్, పీజీ డిప్లొమా ఇన్ ల్యాబరేటరీ టెక్నీషియన్‌లో ఉత్తీర్ణులైన వారికి ప్రతిభ ఆధారంగా ఉపకార వేతనాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అందుకు దరఖాస్తు ఫారాలు సంబంధిత, సహాయ కార్మిక కమిషనర్ కార్యాలయంలో పొందవచ్చని, పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను ఫిబ్రవరి 15 లోపు సంబంధిత కార్మిక శాఖ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న లేదా గడువు తర్వాత సమర్పించిన దరఖాస్తులు తిరస్కరిస్తారని తెలిపారు.

## రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు పది ప్రదర్శనలు ఎంపిక

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 20: ఈ నెల 22న ఆన్‌లైన్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు జిల్లా నుంచి 10 ప్రదర్శనలు ఎంపికైనాయి. ఈ నెల 1 నుంచి 11 వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫేయిర్‌లో 287 మంది విద్యార్థులు ప్రదర్శనలో పాల్గొనగా వాటిలో 10 ఉత్తమ ప్రదర్శనలను సీనియర్, జూనియర్ విభాగాల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయి పోటీలకు జడ్పీహెచ్‌ఎస్ కారుకొండ రాజు, సానియా, జడ్పీహెచ్‌ఎస్ తోటపల్లి పూజ, జడ్పీజీఎంహెచ్‌ఎస్ రిశ్వాంత్, జడ్పీహెచ్‌ఎస్ మాదారం మోహన్, తెలకపల్లి కేకేరెడ్డి హైస్కూల్ సాయి సాత్విక్, జడ్పీహెచ్‌ఎస్ లింగాల హర్ష, జడ్పీహెచ్‌ఎస్ బాలుర నాగర్‌కర్నూల్ ఖలీలుల్లాఖాన్, జడ్పీహెచ్‌ఎస్ అచ్చంపేట సానియా, జడ్పీహెచ్‌ఎస్ రఘుపతిపేట శివ ఎంపికైనారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు వారి ప్రదర్శనలను ఈనెల 22న సాయంత్రం 5 గంటల లోపు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని జిల్లా విద్యాధికారి గోవిందరాజులు తెలిపారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చిన్నంబావి, జనవరి 20 : కారు, బైకు ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం అమ్మాయిపల్లి గ్రామంలో మకర సంక్రాంతి రోజున గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ కురుమయ్య(45) బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన కారు ఇతన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కురుమయ్యను పెబ్బేరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ కురుమయ్య శనివారం మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

» 13 మందిపై కేసులు నమోదు

మరికల్, జనవరి 20 : పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి 13 మందిపై గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేశారు. ఈ సంఘటన నారాయణపేట జిల్లా మరికల్ మండలం జిన్నారం గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి కథనం ప్రకారం.. జిన్నారం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న 13 మందిని పట్టుకొని, వారి నుంచి రూ.29,760 నగదు, 13 సెల్‌ఫోన్లు, 8 ద్విచక్ర వాహనాలతో పాటు పేక ముక్కలను స్వాధీనం చేసుకొని గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## హెల్త్ సబ్ సెంటర్‌లో అగ్ని ప్రమాదం

» రూ.40 వేల ఆస్తి నష్టం

తెలకపల్లి, జనవరి 20 : నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల పరిధిలోని ఆలేరు హెల్త్ సెంటర్‌లో శనివారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ సంఘటనలో 40వేల ఆస్తి నష్టం జరిగినట్లు మెడికల్ ఆఫీసర్ శివరాజు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సెంటర్‌లో పని చేస్తున్నా ఏఎన్‌ఎం శనివారం ఆరోగ్య సెంటర్‌కు వెళ్లి చూడగా సెంటర్‌లో ఉన్న మెడిసిన్స్, మెడికల్ పరికరాలు, ఫర్నిచర్ కాలిపోయి ఉందని ఈ విషయం ఏఎన్‌ఎం తనకు తెలపడంతో వెంటనే ఆరోగ్య సెంటర్‌కు వెళ్లి చూడగా హెల్త్ సెంటర్‌ను పరిశీలించినట్లు తెలిపారు. దాదాపు 40వేల వరకు నష్టం వాటిల్లిందని తెలిపారు.

## చెరువులో పడి ఎద్దుల మృతి



గండం చెరువులో పడి మృతి చెందిన ఎద్దులు

వనపర్తి రూరల్, జనవరి 20 : ప్రమాదశాత్తు చెరువులో పడి ఎద్దులు మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా పరిధిలోని పెద్దగూడెం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నాగపురి ఆంజనేయులుకు చెందిన రెండు ఎద్దులు గ్రామ శివారులోని గండం చెరువుకు తాగునీటి కోసం వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులో పడి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఎద్దుల విలువ దాదాపు రూ.రెండు లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

# ఉమామహేశ్వర క్షేత్రంలో భక్తుల సందడి

» ఆలయంలో ఎంపీ రాములు ప్రత్యేక పూజలు



ఆలయ ఆవరణలో ఎంపీ రాములును శాలువాతో సన్మానిస్తున్న ఆలయ ఈవో, అర్చకులు

అచ్చంపేట, జనవరి 20: ఉమామహేశ్వర క్షేత్రంలో శనివారం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు పోతుగంటి రాములు ఈశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ ఈవో శ్రీనివాసరావు, ఆలయ కమిటీ చైర్మన్ కందూరు సుధాకర్‌లు, అర్చకులు వీరయ్య పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. పాపనాశిని గుండంలో పుణ్యస్నానాలు ఆచరించి ఈశ్వరుడికి పాలాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, గణపతి అయ్యప్పస్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. అర్చకులు వీరయ్య, నీలకంఠం, రాజశేఖర్, రవికుమార్‌లు ఆయనకు ఆలయ చరిత్ర వివరించారు. ఉమామహేశ్వరం క్షేత్రంలో స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి హైదరాబాద్, నల్గొండ, ఉమ్మడి మహబూబ్‌నగర్, దేవరకొండ తదితర ప్రాంతాల నుంచి శ్రీశైలం వెళ్లే భక్తులు ఉమామహేశ్వరుడ్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కొంతమంది భక్తులు భోగమహేశ్వరం నుంచి మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకుని ఈశ్వరునికి ప్రత్యేకపూజలు చేశారు. ఈ నెల 15వ తేదీ నుంచి ఉమామహేశ్వర క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుండడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో శ్రీనివాసరావు, ఆలయ కమిటీ చైర్మన్ కమిటీ చైర్మన్ కందూరి సుధాకర్ అన్ని విధాల చర్యలు తీసుకున్నారు. వాహనాలను కొండ దిగువన ఉన్న భోగమహేశ్వరం వద్దనే నిలిపివేశారు. అచ్చంపేట సీఐ అనుదీప్ ఆధ్వరంలో ఎస్సై గోవర్ధన్ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. అచ్చంపేట ఆర్టీసీ డిపో నుంచి నాలుగు మినీ బస్సులను కొండపైకి భక్తులను చేరవేసేందుకు ప్రసాద్ ఏర్పాటుచేశారు.

# న్యాయ సేవలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి

» సీనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి

మహబూబ్‌నగర్, జనవరి 20 : న్యాయసేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాసదన్ కార్యదర్శి సంధ్యారాణి అన్నారు. జిల్లా న్యాయసేవాసదన్ కార్యాలయ భవనంలో శనివారం ప్యానల్ న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లోకి నల్సా పథకాలను వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్ళి అవగాహన కల్పించాలని కోరారు. ఇందుకు అనుగుణంగా ప్రణాళిక బద్ధంగా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్, జైలు విజిట్ న్యాయవాదులు చేపడుతున్న కార్యక్రమాలు, కేసుల పురోగతిపై ఎప్పటికప్పుడు న్యాయవాదులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్ర మంలోచీఫ్ డిఫెన్స్ కౌన్సిల్‌రఘుపతి, అదనపు సెషన్స్ కౌన్సిల్ సభ్యులు యోగేశ్వర్, మల్లారెడ్డి, రాజేశ్, ప్యానెల్ న్యాయవాదులు, పారాలీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## సుబ్రమణ్యస్వామిని దర్శించుకున్న చల్లావంశీచంద్ కుటుంబ సభ్యులు



కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలో కాంగ్రెస్ నాయకుడు చల్లా వంశీచంద్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జనవరి 20 : కర్ణాటకలోని ప్రసిద్ధ ఆలయాలలో సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి శనివారం కుటుంబ సమేతంగా పూజలు చేశారు. కర్ణాటకలోని అత్యంత పురాతన, విశిష్ట గల కుక్కేలోని సుబ్రమణ్యస్వామి, సౌతడ్కలోని శ్రీ మహాగణపతి, ధర్మస్థలిలోని మంజునాథేశ్వర స్వామి దేవాలయాల్లో కుటుంబ సభ్యులతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు చేశారు.

## బియ్యపు గింజలపై శ్రీరామ కోటి

» అయోధ్యకు 10,116 శ్రీరామనామ బియ్యపు గింజలు



బియ్యపు గింజెలపై శ్రీరామ నామం లిఖిస్తున్న లక్ష్మి

గద్వాల టౌన్, జనవరి 20 : పట్టణానికి చెందిన గృహిణి ఇల్లూరు శ్రీలక్ష్మి బియ్యపు గింజలపై శ్రీరామ నామాన్ని లిఖిస్తూ తనదైన రీతిలో భక్తుని చాటింది. ఈనెల 22న అయోధ్యలో శ్రీరామచంద్రుడి విగ్రహం ప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతున్న నేపథ్యంలో 10,116 బియ్యపు గింజలపై శ్రీరామ నామాన్ని లిఖించి పంపుతున్నట్లు 'ఆంధ్రజ్యోతి'కి శనివారం తెలిపింది. స్థానిక న్యాయవాది ఇల్లూరు వెంకటేష్ సతీమణి శ్రీలక్ష్మి గడచిన తొమ్మిదేళ్లుగా బియ్యపు గింజలపై శ్రీరామ నామాన్ని లిఖిస్తూ ప్రతియేటా భద్రాచలంలో శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించే స్వామివారి కల్యాణానికి పంపుతుండటం విశేషం. కాగా, భద్రాచలంతో పాటు పట్టణంలోని వాసవీ శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహించే శ్రీరామనవమి వేడుకకు తలంబ్రాలను సమర్పిస్తున్నట్లు తెలిపింది. ఇప్పటి వరకు నాలుగు లక్షలకుపైగా బియ్యపు గింజలపై శ్రీరామ నామాన్ని లిఖించినట్లు వివరించింది.

# ఆధ్యాత్మిక చింతనతోనే గ్రామాల్లో సుఖశాంతులు

» శృంగేరి పీఠం గురూజీ సదాశివస్వామి



సదాశివస్వామిని సన్మానిస్తున్న వీహెచ్‌పీ, వికాస తరంగిణి సభ్యులు

మన్ననూర్, జనవరి 20 : ఆధ్యాత్మిక చింతనతోనే గ్రామాల్లో సుఖశాంతులు వర్ధిల్లుతాయని శృంగేరి పీఠం గురూజీ సదాశివస్వామి అన్నారు. లోకకల్యాణం కోసం దక్షిణ భారత దేశంలోని పుణ్యక్షేత్రాల సందర్శనలో భాగంగా ఆయన హైదరాబాద్ గచ్చిబౌలి నుంచి శ్రీశైలానికి చేస్తున్న పాదయాత్ర శనివారం మన్ననూరు గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని వీహెచ్‌పీ, వికాస తరంగిణి, ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయన భక్తులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాలా ఏళ్లుగా హిందూ సమాజం కలలు కంటున్న అయోధ్య రామ మందిర నిర్మాణం పూర్తయి ఈ నెల 22న బాలరాముడి ప్రతిష్ఠ జరుగుతుండడంపై ప్రజలు ఆనందంగా ఉన్నారని, దేశ వ్యాప్తంగా ఎక్కడ పర్యటించినా రామనామ జపమే వినిపిస్తుందన్నారు. కాకతీయ రాజుల కాలంలో నిర్మించిన మన్ననూరు వేణుగోపాలస్వామి ఆలయం ఇక్కడ ఉండడం ఇక్కడి ప్రజలు చేసుకున్న పుణ్యమన్నారు. గ్రామంలో ప్రతీ రోజు ఒక గంట సేపు భగవద్గీత, రామాయణం వంటి ప్రవచనాలు వినపడేలా మైకుల్లో శబ్ద ప్రదర్శన చేయాలన్నారు. ఇట్టి ప్రవచనాలు వింటే ప్రజలు భక్తి భావంతో ఉంటారని ఈ సందర్భంగా భక్తులకు ఉద్బోదించారు. శృంగేరీ పీఠం సభ్యులు రవి శర్మ, జితేంద్ర శర్మ, మోహిత్ శర్మ, వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు సంభు వెంకట్‌రమణ, వికాస తరంగిణి సభ్యులు జూలూరి సత్యనారాయణ, సంభు శ్రీనివాసులు, సంభు శోభ, జయమ్మ, ప్రభావతమ్మ, శేఖర్, సరస్వతీ, రమేష్, ఆలయాల అర్చకులు శ్రీనివాస్ శర్మ, ఆదిత్యారాం శర్మ, నర్సింహాచార్యులు పాల్గొన్నారు.

## ఇసుక డంపు సీజ్



ఇసుక డంపును పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్ఐ

మాగనూరు, జనవరి 20 : నారాయణపేట జిల్లా మాగనూరు మండలం నేడగం గ్రామ శివారులోని పెద్ద వాగు వద్ద డంపు చేసిన ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ సతీష్‌కుమార్ శనివారం తెలిపారు. తహసీల్దార్ కథనం ప్రకారం.. అక్రమంగా ఇసుకను రవాణా చేసేందుకు డంపు చేయగా పక్కా సమాచారంతో పోలీసుల సహకారంతో ఇసుక డంపు సీజ్ చేసి, పంచనామ నిర్వహించి ఇసుకను పోలీస్ స్టేషన్ తరలించినట్లు తెలిపారు. అక్రమంగా ఇసుకను డంపు చేసిన వ్యక్తులను పట్టుకొని వారిపై కేసు నమోదు చేయాలని తహసీల్దార్ పోలీసులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ మల్లేష్, రెవెన్యూ ఇన్స్‌స్పెక్టర్ శ్రీశైలం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కుంగిన బ్రిడ్జి

» పట్టించుకోని అధికారులు
» ఆందోళనలో వాహనదారులు, గ్రామస్థులు



రోడ్డు మధ్యలో కుంగిన బ్రిడ్జి

గోపాల్‌పేట, జనవరి 20 : వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని తాడిపర్తి గ్రామ పరిధిలో గణపతిసముద్రం చెరువు కట్టపై నుంచి చెన్నూరుకు రహదారిగా ఏర్పాటు చేసిన బ్రిడ్జి లోపలికి కుంగిపోయింది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో ఆందోళనలో గ్రామస్థులు ఉన్నారు. చెన్నూరు గ్రామానికి వెళ్లే ఈ రహదారి బ్రిడ్జి కుంగిన విషయం తెలియని భారీ వాహనదారులు రాత్రి సమయంలో వస్తే బ్రిడ్జి మరింత కుంగి లోపలికి పడిపోయే ప్రమాదముందని గ్రామస్థులతో పాటు వాహనదారులు పేర్కొన్నారు. అధికారులు మాత్రం తమకేమీ తెలియనట్లు కుంగిన రహదారిపై మట్టి పోసి నామమాత్రంగా వదిలేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కుంగిపోయిన బ్రిడ్జిపై హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి, బ్రిడ్జిపై మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

## జోగుళాంబ ఆలయ భూముల పరిశీలన



ఆలయ భూములను పరిశీలిస్తున్న కమిటీ చైర్మన్ చిన్నకృష్ణయ్య, ఈవో పురేందర్‌కుమార్

అలంపూర్ చౌరస్తా, జనవరి 20: జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలకు చెందిన వ్యవసాయ భూములను ఆలయ కమిటీ చైర్మన్ చిన్న కృష్ణయ్య, ఈవో పురేందర్‌కుమార్, సిబ్బంది పరిశీలించారు. అలంపూర్ మండల పరిధిలోని ఇమాంపూరం గ్రామంలో ఆలయానికి చెందిన 24 ఎకరాల భూమి హద్దులను తనిఖీ చేశారు. కంపచెట్లను తొలగిస్తే మరింత భూమి సాగులోకి వస్తుందని అధికారులు గుర్తించారు. పదేళ్లగా కౌలు బకాలు చెల్లించని రైతులతో మాట్లాడారు. వెంటనే కౌలు చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పెట్టుబడులు వృత్తిగా తీసుకుంటేనే స్టాక్ మార్కెట్‌లో ఉన్నతి

» గోవా యూనివర్సిటీ ప్రొఫెసర్ రమేశ్

పాలమూరు యూనివర్సిటీ, జనవరి 20 : పెట్టుబడులను అలవాటుగా కాకుండా, వృత్తిగా తీసుకుంటే స్టాక్‌మార్కెట్‌లో ఉన్నతి సాధించవచ్చని గోవా యూనివర్సిటీ ప్రొఫెసర్ రమేశ్ తెలిపారు. శనివారం పాలమూరు యూనివర్సిటీలో కామర్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు 'స్టాక్ మార్కెట్ - పెట్టుబడుల ప్రాధాన్యత' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. స్టాక్‌మార్కెట్ ఒడుదుడుకులను ఈ సందర్భంగా ఆయన వివరించారు. ప్రస్తుత సాంకేతిక, ఆర్థిక అంశాలు భారత స్టాక్‌మార్కెట్‌ను ఏరకంగా ప్రభావితం చేస్తాయనే అంశంపై ఆయన విశదీకరించారు. దేశంలో ప్రభుత్వ రంగంలో పెట్టుబడుల ఉపసంహరణ అంశాన్ని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పీయూ వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ అనురాధారెడ్డి, డాక్టర్ అర్జున్ కుమార్, రంగప్ప, సురేష్, వెంకటేశ్, జావిద్, ఎంబీఏ, కామర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

## గద్వాల చిన్నారికి నృత్య కిరణ్ అవార్డు



నటుడు బాబూమోహన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న మనస్విని

గద్వాల టౌన్, జనవరి 20 : గద్వాల పట్టణానికి చెందిన చిన్నారి మనస్విని హైదరాబాద్ నవ వసంతం కూచిపూడి కళానిలయం ఆధ్వర్యంలో అందజేసే నృత్యకిరణ్-2024 అవార్డును దక్కించుకుంది. పట్టణంలోని సత్యసాయి పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న మనస్విని స్థానిక కూచిపూడి నృత్య గురువు ఏలేశ్వరపు వెంకటేశ్వర్లు వద్ద శిక్షణ పొందింది. కళానిలయం వారు శనివారం హైదరాబాద్‌లోని పబ్లిక్‌గార్డెన్స్ ఎన్టీఆర్ కళామందిరంలో నిర్వహించిన కూచిపూడి, భరతనాట్యం, ఆంధ్రనాట్యం పేరిట జానపద అంశాల పోటీల్లో పాల్గొని అవార్డును దక్కించుకుంది. అవార్డును తెలుగు సినీ నటుడు బాబూమోహన్ చిన్నారికి అందజేసినట్లు తండ్రి, స్థానిక సామాజిక కార్యకర్త రాజేష్ తెలిపారు.

## వచ్చేనెల 19 నుంచి మన్యంకొండ బ్రహ్మోత్సవాలు

» 24న రథోత్సవం » మార్చి 25న అమ్మవారి తిరుకల్యాణోత్సవం



బ్రహ్మోత్సవాల తేదీలను ప్రకటిస్తున్న ఆలయ ధర్మకర్త, అర్చకులు

మహబూబ్‌నగర్ రూరల్, జనవరి 20: పేదల తిరుపతి మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను ఫిబ్రవరి 19 నుంచి మార్చి 8వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త అళహరి మధుసూదన్‌కుమార్ తెలిపారు. శనివారం ఆలయంలో జరిగిన పండితుల సమావేశంలో వార్షికబ్రహ్మోత్సవాల తేదీలను నిర్ణయించినట్లు తెలిపారు. 19న సోమవారం తిరుచ్చిసేవతో బ్రహ్మోత్సవాలు మొదలవుతాయని, బ్రహ్మోత్సవాల్లో కీలకఘట్టమైన రథోత్సవం ఫిబ్రవరి 24న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 20న హంసవాహన సేవ, 21న గజవాహనసేవ, 22న సూర్యప్రభ వాహనసేవ, 23న హనుమవాహనసేవ, 25న అశ్వ వాహనసేవ, 26న స్వామివారి దర్బారుసేవ, మార్చి 2న శేషవాహనసేవ ఉంటుందని తెలిపారు. మార్చి 8న మహాశివరాత్రి ఉత్సవాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వెల్లడించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే భక్తులక ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. అదే విధంగా కొండదిగువన శ్రీ అలివేలుమంగతాయారు అమ్మవారి బ్రహ్మోత్సవాలు మార్చి 23 నుంచి మార్చి 27వరకు కొనసాగుతాయని తెలిపారు. మార్చి 23న అంకురార్పణ ఉంటుందని, 24న ధ్వజారోహణ కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. మార్చి 25 మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారి తిరుకల్యాణోత్సవం, రాత్రికి రథోత్సవం, విమాన రథోత్సవం ఉంటాయని వెల్లడించారు. మార్చి 26న అశ్వవాహన సేవ, మార్చి 27న పూర్ణాహుతి, వసంత సేవతో అమ్మవారి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ధర్మకర్తలు తెలిపారు.

## 19 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

తెలకపల్లి, జనవరి 20 : నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల కేంద్రంలో గ్రామస్థుల దగ్గర బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి అమ్ముతున్న పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మండల పరిధిలోని లక్నారం గ్రామానికి చెందిన ఎండీ ఉస్మాన్ అనే వ్యక్తి గ్రామస్థుల వద్ద తక్కువ ధరకు పీడీఎస్ బియ్యం కొని నాగర్‌కర్నూల్‌లోని కోళ్ల ఫారాలకు అధిక ధరలకు అమ్మడానికి పోతుండగా తహసీల్దార్ రామ్మోహన్, ఎస్ఐ రామేశ్వర్‌రెడ్డిలతో కలిసి పంచనామా చేసి 19క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనపర్చుకుని భద్రత నిమిత్తం ఎంఎల్ఎస్ పాయింట్ తెలకపల్లి ఇవ్వడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

## ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

చారకొండ, జనవరి 20: నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండల పరిధిలోని సారబండతండాకు చెందిన వద్యావత్ దస్రునాయక్ టాటాఏసీ వాహనంలో అక్రమంగా ఆరు క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని తరలిస్తుండగా శనివారం తెల్లవారుజామున మండల కేంద్రంలో పోలీసులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పట్టబడిన రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రవికుమార్‌యాదవ్ పరిశీలించి రేషన్‌బియ్యాన్ని మండల కేంద్రంలోని వెంకటేశ్వర రైస్‌మిల్లులో భద్రపరిచి వాహనాన్ని పోలీసులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. ఈ సంఘటనపై ఎస్ఐ రవి కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. మండలంలో ఎవరైనా అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని ఈసందర్భంగా ఎస్ఐ రవి హెచ్చరించారు.

## పది అడుగుల జెర్రిపోతు కుబుసం



కుబుసంను భద్రపరుస్తున్న డాక్టర్ సదాశివయ్య

జడ్చర్ల, జనవరి 20 : జెర్రిపోతు పాము 10.06 అడుగుల పొడవు గల కుబుసం కనుగొన్నట్లు జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర సహాయాచార్యులు డాక్టర్ సదాశివయ్య తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం గొరిట గ్రామంలో శనివారం అతిపెద్ద జెర్రిపోతు పాము కుబుసం లభ్యమయ్యిందన్నారు. 10.06 అడుగుల పొడవు గల అతిపెద్ద జెర్రిపోతుపాము కుబుసం ఇప్పటి వరకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా నమోదు కాలేదని తెలిపారు. ఇప్పటి వరకు 7.2 అడుగుల పొడవు ఉన్న కుబుసం నమోదు అయి ఉందని వెల్లడించారు. గొరిటలో లభ్యమయిన 10.06 అడుగుల జెర్రిపోతు కుబుసంను జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీకళాశాలలో భద్రపరిచినట్లు చెప్పారు. పాముల కుబుసంను భద్రపరిచే మ్యూజియంలు లేవని, అరుదైన అంశాలతో కళాశాలలో మ్యూజియం ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. కుబుసంను సేకరించడం అత్యంత కష్టతరమైన, సున్నితమైన అంశమని పేర్కొన్నారు. కుబుసంను ఆభరణాల తయారీలో, ఇళ్లలో అలంకరణ వస్తువులుగా వినియోగిస్తారని తెలిపారు. కుబుసంను భద్రపరిచే అంశంలో పరిశోధక విద్యార్థులు రమాదేవి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు రాహుల్, ఇందు, అఖిలలు పాల్గొన్నారు.

## గడప గడపకు అయోధ్య అక్షింతలు



గుమ్మకొండలో అయోధ్య అక్షింతల పంపిణీకి వెళ్తున్న భక్తులు

తిమ్మాజిపేట, జనవరి 20: తిమ్మాజిపేట మండల పరిధిలోని గుమ్మకొండలో శనివారం అయోధ్య రామయ్య అక్షింతలను గడపగడపకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు భక్తులు శ్రీరాముని జెండాలను పట్టుకుని శ్రీరామ జయరామ జయజయ రామ అంటూ సంకీర్తనలు చేస్తూ పురవీధుల్లో తిరుగుతూ అయోధ్య అక్షింతలను ప్రతి ఇంటికి అందజేశారు. మహిళలు భక్తిశ్రద్ధలతో హారతులతో స్వాగతించారు. ఈ నెల 22న అయోధ్యలో నిర్వహించే శ్రీరాముని ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని అక్షింతలను ప్రతీ ఒక్కరు తలపై వేసుకోవాలని శ్రీరాముని కరుణ కటాక్షాలను పొందాలని అందరూ ఆయురారోగ్యాలను పొందాలని ప్రజలకు ఆలయ కమిటీ సభ్యులు అన్నారు. 22న పొద్దున్నే ప్రతీ ఇంటి ముందు రంగుల ముగ్గులు వేసి మామిడి ఆకులతోరణాలు కట్టాలన్నారు. సాయంత్రం ప్రతీ ఇంట్లో దీపాలు వెలిగించి ఇంటిపై కాషాయ జెండాలను కట్టి రామ నామాన్ని జపం చేయాలని సూచించారు. గురుప్రసాద్, పుల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నరేందర్, శేఖర్‌రెడ్డి, మాధవరెడ్డి, భీమయ్య, కృష్ణారెడ్డి, రాములు, ప్రభావతి, అరుణమ్మ, అమృతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ అభివృద్ధికి రూ.3లక్షల విరాళం



రూ.3లక్షల చెక్కును అందజేస్తున్న ఆశాదీప్‌రెడ్డి

కల్వకుర్తి, జనవరి 20 : కల్వకుర్తి మండలం రఘుపతిపేట పరిధిలోని రామగిరి సీతారామచంద్రస్వామి దేవాలయానికి కాయితీ ప్రభాకర్‌రెడ్డి జ్ఞాపకార్థం అన్నదాన సత్రం నిర్మాణానికి రూ.3లక్షల రూపాయలను యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కాయితీ ఆశాదీప్‌రెడ్డి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి కాయితీ ప్రభాకర్‌రెడ్డి జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. దేవాలయ అభివృద్ధికి తన సహాయ సహకారాలుంటాయని ఆయన పేర్కొన్నారు. సర్పంచ్ రేణుక, బాలస్వామి, చంద్రగౌడ్, హరీష్‌రెడ్డి, విజయ్‌గౌడ్, చెన్న వెంకటయ్య, బాబు, పరుశరాములు, రవికుమార్‌రెడ్డి, జానకి, అశోక్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన

బిజినేపల్లి, జనవరి 20 : విద్యార్థి దశ నుంచే దేశంలో అమలవుతున్న చట్టాలపై అవగాహన కల్గి ఉండాలని నాగర్‌కర్నూల్ జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి జి.సబిత అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర గురుకుల పాఠశాలలో శనివారం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి మాట్లాడారు. చట్టాలపై పూర్తి అవగాహన కల్గి ఉంటే భవిష్యతులో ఎలాంటి ఇబ్బందులు వచ్చినా వాటిని చట్ట పరిధిలో ఎలా పరిష్కరించుకోవాలో తెలుస్తుందన్నారు. అలాగే సమాచారహక్కు చట్టం ద్వారా కలిగే ప్రయోజనాలను తెలుసుకొని ప్రజలకు వివరించాలని సూచించారు. లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ మధుసూదనరావు, డ్యూటీ చీఫ్ లీగల్ శ్రీరామ్ ఆర్య, న్యాయవాదులు శ్యాంప్రసాద్ రావు, బోనాసి రాంచందర్, హెచ్‌ఎం సుమతి, ఉపాధ్యాయులు మనిగిళ్ల ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

## రూర్బన్ మిషన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



వెన్నచెర్లలో మినీ స్టేడియం పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ

పెద్దకొత్తపల్లి, జనవరి 20 : మండల పరిధిలోని వెన్నచెర్ల గ్రామంలో జరుగుతున్న రూర్బన్ మిషన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని వెన్నచెర్ల గ్రామంలో రూర్బన్ మిషన్ పథకం కింద 25లక్షల రూపాయలతో నిర్మిస్తున్న మినీ స్టేడియం పనులను, అలాగే గ్రంథాలయ భవనం, మీ సేవా కేంద్రం, బస్ షెల్టర్, ఆరోగ్య ఉప కేంద్రం, వెటర్నరీ ఆసుపత్రి వంటి భవన నిర్మాణ పనులను నాణ్యతతో చేపట్టాలని ఆయన సూచించారు. ఆయన వెంట సర్పంచ్ బి.రాధ, ఎంపీటీసీ సభ్యుడు రవికుమార్, మాజీ సింగిల్‌విండో ఛైర్మన్ జి.బాలస్వామి, మాజీ ఉప సర్పంచ్ పర్వతాలు, నాయకులు వెంకటస్వామి, శ్రీనివాస్‌యాదవ్, మల్లేష్, చంద్రశేఖర్ ఉన్నారు.

**బాధిత కుటుంబానికి పరామర్శ**

మండల పరిధిలోని వెన్నచెర్ల గ్రామానికి చెందిన దేవరపాగ మశమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. శనివారం దశదినకర్మ కార్యక్రమంలో ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ పాల్గొని మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వెలిబుచ్చారు. సర్పంచ్ రాధ, ఎంపీటీసీ సభ్యుడు రవికుమార్, మాజీ ఉప సర్పంచ్ పర్వతాలు, ఉపాధ్యాయులు ప్రభాకర్, నాయకులు జంగం పెద్దరాజు, బైరాజు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## అచ్చంపేటలో ఆల్ ఇండియా క్రికెట్ టోర్నమెంట్




ఆల్ ఇండియా క్రికెట్ టోర్నమెంట్ లోగోను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

అచ్చంపేటటౌన్, జనవరి 20: ఆల్ ఇండియా క్రికెట్ టోర్నమెంట్ పోటీల లోగోను శనివారం పట్టణంలోని ఎన్టీఆర్ మినీస్టేడియంలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుంచి ప్రారంభమయ్యే ఆల్ ఇండియా క్రికెట్ టోర్నమెంట్‌కు తెలుగు రాష్ట్రాల నుంచే కాక వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరవుతారన్నారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. నల్లమల నుంచి జాతీయ స్థాయిలో క్రీడాకారులను తయారుచేయడమే తన లక్ష్యమన్నారు. నాయకులు చంద్రమౌళి, చత్రునాయక్, గౌరీశంకర్, కాశన్న యాదవ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో శనీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

బిజినేపల్లి, జనవరి 20: శనీశ్వర స్వామికి భక్తిశ్రద్ధలతో భక్తులు తిల తైల అభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన పూజారి డాక్టర్ గవ్వమఠం విశ్వనాథశాస్త్రి తెలిపారు. మండల పరిధిలోని నందివడ్డెమాన్‌లోని నందీశ్వరాలయం ఆవరణలోని శనీశ్వర స్వామికి శనివారం భక్తులు నల్లని వస్త్రాలు ధరించి నువ్వుల నూనె, జిల్లేడు పూలు, నల్లని నువులు, నల్లని వస్త్రంతో పూజలు ఘనంగా చేశారు. శనీశ్వర స్వామిని ఏడు వారాల పాటు పూజించిన అనంతరం ఆలయ ఆవరణలోని నందీశ్వర పరమశివున్ని వివిధ రకాల పండ్ల రసాలు, బిల్వ పత్రాలతో అభిషేకాలు, రుద్రాభిషేకాలు నిర్వహిస్తే స్వామి వారి కృపకు నోచుకుంటారని ప్రధాన అర్చకులు వివరించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి వసతి, అల్పాహారం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ గోపాల్‌రావు తెలిపారు. పూజారులు ఉమామహేశ్వరం, శాంతికుమార్, ఆలయ కమిటీ సభ్యులు ప్రభాకరాచారి, వీరశేఖర్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్‌లో విద్యార్థికి ద్వితీయ బహుమతి

తెలకపల్లి, జనవరి 20 : ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన సైన్స్ ఫెయిర్‌లో భాగంగా గణిత శాస్త్ర విజ్ఞాన విభాగంలో తెలకపల్లిలో గల సిద్ధార్థ మోడల్ స్కూల్ విద్యార్థినీకి ద్వితీయ బహుమతి రావడం జరిగింది. బహుమతి సాధించిన విద్యార్థిని శ్రీలలితను ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌గౌడ్, గణిత ఉపాధ్యాయులు రాములు, ఉపాధ్యాయ బృందం విద్యార్థినీని అభినందించారు.

# ఆసుపత్రులు కట్టారు.. సిబ్బందిని మరిచారు

- ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- నర్సింగ్ కళాశాల ఏర్పాటు పై సీఎంతో చర్చిస్తా
- వెల్టూరులో పీహెచ్‌సీ ఏర్పాటు
- పట్టణంలో బస్తీ దవాఖానకు శంకుస్థాపన
- మొదటిసారి వచ్చిన మంత్రికి ఘన సన్మానం



ఆసుపత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

అచ్చంపేట, జనవరి 20 : బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆసుపత్రులను కట్టి వైద్యసిబ్బందిని నియమించడంలో విఫలమైందని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ విమర్శించారు. శనివారం అచ్చంపేట పట్టణంలోని 100 పడకల ఆసుపత్రిని పరిశీలించి మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం మాదిరి కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఆసుపత్రులకు కావాల్సిన మౌలిక వసతులను కల్పించి నిరుపేదలకు మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. ఉప్పునుంతల మండలంలోని వెల్టూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలోని అన్ని మండాలల్లోని పీహెచ్‌సీలలో పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని నియమిస్తామన్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ కోరిక మేరకు నర్సింగ్ కళాశాల ఏర్పాటు కోసం సీఎంతో చర్చిస్తానని తెలిపారు. అనంతరం రాజీవ్‌నగర్ కాలనీలో బస్తీ దవాఖాన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అంతకు ముందు మంత్రి దామోదర రాజనర్సింహను పట్టణంలోని అంబేడ్కర్ ప్రజా భవన్‌లో ఎమ్మెల్యే వంశీకృష్ణ, కాంగ్రెస్ నాయకులు శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. అదే విధంగా తమ సమస్యలు పరిష్కారించాలని ఉపాధ్యాయులు వినతి పత్రం అందజేశారు. డీసీహెచ్ఎస్ రమేష్‌చంద్ర, డీఎంహెచ్‌వో సుధాకర్‌లాల్, నాయకులు రాజేందర్, కట్టా అనంతరెడ్డి, గౌరిశంకర్, తదితరులు ఉన్నారు.

**పేదలకు మెరుగైన వైద్యం అందిస్తాం**

దోమలపెంట: నల్లమల ప్రాంతంలో ఉన్న పేదలకు మెరుగైన వైద్యం అందిస్తామని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో కలిసి వటవర్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగ గ్రామ సర్పంచ్ చత్రునాయక్ మంత్రికి గ్రామంలో నెలకొన్న సమస్యలు, శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న వటవర్లపల్లి ఆరోగ్య కేంద్రం 24గంటలు వైద్య సదుపాయం కల్పించాలని, నైట్ వాచ్‌మన్, స్వీపర్ నియామకం, తగినంత వైద్య సిబ్బంది, ప్రహరీ నిర్మాణం తదితర సమస్యలు పరిష్కరించాలని కోరగా, అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. తొందరలోనే సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి పేర్కొన్నారు. డీఎంహెచ్‌వో సుధార్‌లాల్, డాక్టర్ అశోక్‌కుమార్ ఉన్నారు.

**మంత్రికి కాంగ్రెస్ శ్రేణుల ఘన స్వాగతం**

మన్ననూర్: నల్లమల పర్యటనకు వచ్చిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహకు మన్ననూరులో కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో కలిసి మంత్రి శ్రీశైలం వెళుతున్న క్రమంలో మన్ననూరు అటవీ అతిథి గృహం వద్ద కాసేపు ఆగి తేనీరు తీసుకున్నారు. ఈ సందర్భంగా అమ్రాబాద్, పదర మండలాల్లో ని కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలను మంత్రికి పరిచయం చేసిన వంశీకృష్ణ ఇక్కడి ప్రజల సమస్యలు, వైద్యశాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలు, ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

ఎంపీపీ శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యుడు దాసరి శ్రీనివాసులు, కోఆప్షన్ సభ్యుడు రహీం, కాంగ్రెస్ నాయకులు సంభు వెంకట్‌రమణ, పెర్మాల వెంకటేశ్వర్లు, జూలూరి సత్యనారాయణ, చరణ్, రాజేంద్ర ప్రసాద్, శివాజీ, తుల్యా, శ్రీను, రాజారాం , బాబ, రమణ, బాబ, నరేష్, మధు తదితరులు పాల్గొనారు.

**మంత్రిని సన్మానించిన నాయకులు, అధికారులు**

వెల్దండ: అచ్చంపేటలో జరిగే కార్యక్రమానికి వెళుతున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను వెల్దండ వద్ద అధికారులు, నాయకులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. జిల్లా వైద్యాధికారి సుధాకర్‌లాల్, వైద్యాధికారి స్వరూప, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు బావుండ్ల వెంకటేష్, పీఏసీఎస్ డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్, కిసాన్‌సెల్ అధ్యక్షుడు పర్వత్‌రెడ్డిలతో పాటు పలువురు నాయకులు మంత్రిని సన్మానించారు. మండలంలో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యతనివ్వాలని ఈ సందర్భంగా నాయకులు కోరారు.

# అంగరంగ వైభవంగా వెంకన్న కల్యాణోత్సవం



వెంకన్న స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

బిజినేపల్లి, జనవరి 20 : అలమేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం భక్తుల గోవింద నామస్మరణల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. మండలంలోని పాలెంలోని వెంకన్న స్వామి ఆలయంలో శనివారం పుష్యమాసం దశమి పురస్కరించుకొని ఆలయ ప్రధాన అర్చకుడు కొరవి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో కనుల పండవగా చేపట్టారు. స్వామివారి కల్యాణోత్సవ క్రతువును వేదపండితుల మంత్రోచ్ఛారణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు ప్రత్యేక తీర్థప్రసాదాలు, నైవేద్యాలను స్వీకరించారు. కల్యాణోత్సవంలో గాడి సరేందర్, సూర్యకళ దంపతులు, సొప్పరి బాలస్వామి, బోనాసి పెద్ద కురుమయ్య, ఆలయ అర్చకులు జయంత్‌కుమార్, శుక్లా, ఆలయ సిబ్బంది బాబయ్య, శివకుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ పోతుగంటి రాములు



బెక్కెర గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి

కల్వకుర్తి, జనవరి 20 : గ్రామాల అభివృద్ధే లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు అన్నారు. కల్వకుర్తి మండల పరిధిలోని బెక్కెర గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఎంపీ రాములుతో కలిసి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలు సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంగా ముందుకు సాగాలని సూచించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తాము ముందుకు సాగడం జరుగుతుందని పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ రాములును నాయకులు, గ్రామస్థులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. జడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, ఎంపీపీ మనోహర, జడ్పీటీసీ సభ్యుడు భరత్‌ప్రసాద్, వైస్ ఎంపీపీ గోవర్ధన్, మాజీ జడ్పీటీసీ అశోక్‌రెడ్డి, తోటపల్లి సర్పంచ్ శ్రీలత, రాజేష్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఆశాదీప్‌రెడ్డి, పలువురు నాయకులు ఉన్నారు.

## ప్రసాద్‌గౌడ్ మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే నివాళి



పీఈటీ ప్రసాద్‌గౌడ్ మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్

నాగర్‌కర్నూల్ టౌన్/తాడూరు, జనవరి20: గుండె పోటుతో మృతి చెందిన పీఈటీ ప్రసాద్‌గౌడ్ పార్థీవ దేహానికి జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్‌తో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు జెట్టి ధర్మరాజు నివాళులు అర్పించారు. శనివారం జిల్లా కేంద్రంలోని శ్రీనగర్‌కాలనీలో ప్రసాద్‌గౌడ్ ఇంట్లో ఆయన మృతదేహానికి వారు పూల మాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయ వృత్తిలో పని చేసిన ప్రసాద్‌గౌడ్ కల్మషం లేని ఉద్యోగిగా విధి నిర్వహణలో అందరి మన్ననలు పొందారని కొనియాడారు. కాగా, ప్రసాద్‌గౌడ్ కుమారుడు ఆస్ట్రేలియాలో ఉన్నందున ఆదివారం తాడూరు మండలంలోని ఐతోల్ గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కుటుంబాన్ని పరామర్శించిన వారిలో బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకులు లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

## పిల్లలను ప్రతీ రోజు పాఠశాలకు పంపించాలి

లింగాల, జనవరి 20: మండల పరిధిలోని వల్లభాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అర్జున్‌గౌడు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలు ప్రతి రోజు పాఠశాలకు వచ్చే విధంగా చూడాలని అన్నారు. పిల్లలు పాఠశాల నుంచి ఇంటికి వచ్చినప్పుడు సెల్‌ఫోన్, టీవీలు చూడకుండా చూసుకోవాలని తల్లిదండ్రులను సూచించారు. ప్రతి రోజు పాఠశాలలో ఉపాధ్యాయులు బోధించిన అంశాలను ఇంటి వద్ద పిల్లలు చదువుకొనే విధంగా చూసుకోవాలని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు రూప్లనాయక్, తిరుపతయ్య పాల్గొన్నారు.

## ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

కోడేరు, జనవరి 20 : ప్రభుత్వ పాఠశాలల్లో యాజమాన్య కమిటీ సభ్యులు, కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుర్మయ్య శనివారం విడుదల చేశారు. మండల పరిధిలోని కొండ్రావుపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ పాఠశాల యాజమాన్య కమిటీకి తరగతికి ముగ్గురు చొప్పున సభ్యులను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. సభ్యులతో పాటు కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఓటర్లుగా విద్యార్థుల తల్లి లేదా తండ్రి లేదా సంరక్షకుడు పాల్గొనవచ్చన్నారు. ఓటరు జాబితా శనివారం మధ్యాహ్నం విడుదల చేశారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 22వ తేదీ ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఫిర్యాదు చేయాలన్నారు. తుది జాబితా ఈనెల 24న విడుదల చేస్తారన్నారు. ఎన్నికలు ఈనెల 29న ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. అదేరోజు ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక జరుగుతుందన్నారు. ఆదే రోజు మధ్యాహ్నం 2గంటలకు మొదటి యాజమాన్య కమిటీ సమావేశం నిర్వహించబడునని కుర్మయ్య తెలిపారు.

## విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ

కల్వకుర్తి, జనవరి 20 : కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామి వివేకానంద సేవా బృందం సభ్యులు జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడా సామగ్రిని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోను రాణించాలని కోరారు. కళాశాల హెచ్‌ఎం బాలునాయక్, స్వామి వివేకానంద సేవా బృందం సభ్యులు మనీష్‌గౌడ్, చింటు, సతీష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

కల్వకుర్తి, జనవరి 20 : కల్వకుర్తి పట్టణంలోని తిలక్‌నగర్‌కు చెందిన యాదయ్య శనివారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, కౌన్సిలర్ సూర్యప్రకాశ్‌రావు, నాయకులు శ్రీనివాస్‌యాదవ్‌లు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. యాదయ్య మృతదేహం వద్ద నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి ఎడ్మ కిష్టారెడ్డి మెమోరియల్ ట్రస్టు నుంచి చైర్మన్ ఎడ్మ సత్యం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు.

## నేడు పట్టణంలో శ్రీరామ శోభాయాత్ర

అచ్చంపేటటౌన్, జనవరి 20: అయోధ్యలో ఈనెల 22న బాలరామ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం జరగుతున్న తరుణంలో ఆదివారం పట్టణంలోని పురవీధుల వెంట శ్రీరామ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు విశ్వహిందూ పరిషత్ సభ్యుడు వెంకటేశ్వర శర్మ, భ్రమరాంబికా ఆలయ కమిటీ ఛైర్మన్ నల్లపు శ్రీనివాసులు అన్నారు. శనివారం పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో ఛైర్మన్ నర్సింహగౌడ్‌ను కలిసి ఆహ్వానపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు పట్టణంలో సాయంత్రం 4గంటలకు శ్రీరాముని శోభాయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. నాయకులు ప్రతాప్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతికి విద్యే మూలం




సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ బెల్లి యాదయ్య

కల్వకుర్తి, జనవరి 20 : ప్రగతికి విద్యే మూలమని రామన్నపేట డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ బెల్లి యాదయ్య, ప్రముఖ గాయకుడు చింతల యాదగిరిలు అన్నారు. విద్యార్థులు తమ అనుకున్న లక్ష్యాల కోసం సాధన చేస్తే కచ్చితంగా నెరవేరుతుందని పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎ.సురేందర్‌రెడ్డి అధ్యక్షతన విద్యార్థులకు మానసిక వికాసంపై జరిగిన సమావేశానికి అసిస్టెంట్ ప్రొఫెసర్ బెల్లి యాదయ్య ప్రముఖ గాయకుడు చింతల యాదగిరి, ఎంప్లాయిస్ వాయిస్ ఎడిటర్ కేవీ.వెంకటేశ్వర్లు, మాజీ ప్రిన్సిపాల్ సుధాకర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా బెల్లి యాదయ్య, చింతల యాదగిరిలు మాట్లాడుతూ శరీరానికి గాయమైతే మరిచిపోతామని అదే మనస్సుకు గాయమైతే మర్చురాదన్నారు. జీవితాలను మార్చేది అక్షరమేనని అందుకు దోహదపడేది ఉపాధ్యాయులేనన్నారు. అనుకున్న లక్ష్యాలను సాధించడానికి పట్టుదలతో విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జనరల్ క్రాంతి, పాటల వెంకట్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వేణు, అధ్యాపకులు సదానందంగౌడ్, అధ్యాపకులు తదితరులు ఉన్నారు.

## మాజీ వైస్ ఎంపీపీ నరేందర్‌గౌడ్‌ను పరామర్శించిన ఎమ్మెల్సీ

తెలకపల్లి, జనవరి 20 : ఇటీవల గుండెపోటుకు గురైన మాజీ వైస్ ఎంపీపీ కాంగ్రెస్ నాయకుడు నరేందర్‌గౌడ్ ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఇదే క్రమంలో మండల కేంద్రంలో మృతుల కుటుంబాలను కరుణాకుమార్ కుటుంబాన్ని, వెంకటయ్య కుటుంబాలను పరామర్శించారు. ఎమ్మెల్సీ వెంట కాంగ్రెస్ నాయకులు మామిళ్లపల్లి యాదయ్య, సూర్య బాలగౌడ్, స్వామిపాల్గొన్నారు.

## ట్రాఫిక్ రూల్స్ ప్రతీ ఒక్కరు పాటించాలి

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 20 : రోడ్డు భద్రతలను ప్రతీ ఒక్కరు పాటించాల్సిన వసరం ఎంతైనా ఉందని జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి ఎర్రిస్వామి అన్నారు. జిల్లా కేంద్రంలోని డీటీవో కార్యాలయం ముందు రోడ్డు భద్రత వారోత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. మద్యం తాగిన వారు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడపరాదన్నారు. డీటీవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ గురుకులంలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కల్వకుర్తి, జనవరి 20 : కల్వకుర్తి పట్టణంలోని మైనార్టీ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మైనార్టీ గురుకుల ప్రిన్సిపాల్ అర్షియా ఖాతూన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీలలో 40సీట్ల చొప్పున ఉన్నాయని అందులో మైనార్టీ విద్యార్థినులకు 30సీట్లు, పది సీట్లు నాన్‌మైనార్టీ విద్యార్థులకు కేటాయించడం జరుగుతుందని పేర్కొన్నారు. పదవ తరగతి మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

ఆసక్తి గల విద్యార్థులు ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

## రేపు పాఠశాలలకు సెలవు ప్రకటించాలని తహసీల్దార్‌కు వినతి

ఉప్పునుంతల, జనవరి 20: అయోధ్య రాముని ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఈ నెల 22వ తేదీ రోజు ప్రభుత్వం పాఠశాలలకు సెలవులు ప్రకటించాలని కోరుతూ శనివారం మండల కేంద్రమైన ఉప్పునుంతల తహసీల్దార్ తబితారాణికి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా నాయకుడు శేఖర్‌ముదిరాజ్ వినతి ప్రతం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22న గ్రామాల్లో ఇంటింటా పండగ వాతావరణంతో సంబురాలు జరుపుకుంటున్న శుభ తరుణంలో విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించాలని కోరారు. ఉపాధ్యయ నాయకులు శ్రీనివాసులు, జగదీశ్వర్, ఆంజనేయులు, రాజేష్, మల్లారెడ్డి, సురేందర్ గౌడ్, అనురాధ, కల్పన, శ్రీలత, అనిత, తదితరులు ఉన్నారు.

**మీ-సేవ కేంద్రాల ఏర్పాటుకు 23న తుది గడువు**

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 20: నూతన మీసేవ కేంద్రాల నిర్వహణకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 23న తుది గడువని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ పి.సీతారామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కోడేరు మండలంలోని తీగలపల్లి, మైలారం, కొండ్రావుపల్లి గ్రామాలతో పాటు తాడూరు మండల కేంద్రానికి మీ-సేవ కేంద్రాలు మంజూరైనాయని ఆయన తెలిపారు. దరఖాస్తు చేసే అభ్యర్థులు 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగి డిగ్రీ విద్యార్హతతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఖచ్చితంగా ఉండాలని సూచించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు జిల్లా కలెక్టర్, ఈ-గవర్నెన్స్ సెక్రెటరీ పేరు మీద రూ.500 డీడీని జతపరిచి నిర్దేశించిన గడువు రోజున సాయంత్రం 5 గంటల లోగా ఆయా మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో అందజేయాలని ఆయన తెలిపారు.

## డిప్యూటీ సీఎంను కలిసిన నాయకులు

వెల్దండ, జనవరి 20 :రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను వెల్దండ మండల నాయకులు ప్రజాభవన్‌లో కలిశారు. పార్టీ మండల అధ్యక్షుడు మోతీలాల్, సేవాదల్ ఉపాధ్యక్షుడు పుల్లయ్య, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్, నాయకులు హమీద్, గోపాల్‌నాయక్, వెంకటయ్య, జగన్, వెంకటేశ్వరరెడ్డి, చందునాయక్‌లు భట్టివిక్రమార్కను కలిసి శాలువాలతో సన్మానించారు. మండల అభివృద్ధికి తోడ్పాటునందించాలని ఈ సందర్భంగా వారు కోరారు.

**నిషేధిత విత్తనాలు, మందులు అమ్మితే చర్యలు**

తిమ్మాజిపేట, జనవరి 20 : నిషేధిత విత్తనాలు క్రిమిసంహారక మందులు అమ్మితే చర్యలు తప్పనిసరి కేసులు నమోదు చేయడం జరుగుతుందని నాగర్‌కర్నూల్ సహాయ వ్యవసాయ సంచాలకుడు రమేష్‌బాబు హెచ్చరించారు. తిమ్మాజిపేట మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయ ఆవరణలోని ఇఫ్కో బజార్‌ను శనివారం మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్‌తో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి కౌంటర్ ఇన్‌చార్జి ప్రశాంత్‌కు పలు సూచనలు, సలహాలు చేస్తూ రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. స్టాకును రికార్డులో నమోదు చేయాలని ఈపాస్ మిషన్ ద్వారానే రైతుకు ఎరువులు అమ్మాలని అందుకు సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. రైతుకు ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు అమ్మితే రసీదులు ఇవ్వాలన్నారు.

## తప్పులు లేని ఓటరు జాబితా ఉండాలి



ముచర్లపల్లిలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ మోహన రావు

ఊర్కొండ, జనవరి 20: తప్పులు లేని ఓటరు జాబితాను తయారు చేయడమే లక్ష్యంగా పనిచేయాలని మహబూబ్‌నగర్ అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు అన్నారు. శనివారం మండలంలోని ముచర్లపల్లిలో ఆయన ఓటరు జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. ఓటరు జాబితాలో కొన్ని పొరపాట్లు ఉన్నాయని, వాటిని గుర్తించి సరిచేయాలని అన్నారు. అదేవిధంగా మృతి చెందిన వారిని గ్రామాల్లో తెలుసుకొని వాటిని తొలగించడంతో పాటు 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరి పేరు నమోదు చేయించాలని తెలిపారు. ఒకే కటుంబానికి చెందిన ఓటర్లను ఒకే పోలింగ్ బూత్‌లో ఉండేవిధంగా చూడాల్సిన బాధ్యత బీఎల్‌వోలదేనని పేర్కొన్నారు. తహసీల్దార్ చెన్న కిష్టన్న, నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్, గిర్దావరు సతీష్ చంద్ర, గ్రామస్థులు పాల్గొన్నారు.

● చారకొండ: మండలంలోని గ్రామాల్లో శనివారం, ఆదివారం చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, గ్రామాల్లో బీఎల్‌వోలు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టారని తహసీల్దార్ కేసీ ప్రమిల అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీఎల్‌వోలు చేపట్టిన ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ పరిశీలించారు. ఆర్ఐ నబి, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

● ఉప్పునుంతల: జనవరి 1, 2024 నాటికి 18 ఏళ్ల పూర్తి చేసుకున్న యువతీ యవకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని సర్పంచ్ మల్లారెడ్డి కోరారు శనివారం మండల పరిధిలోని జప్తిసదగోడు గ్రామంలో స్పెషల్ క్యాంపైన్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో యువతి ఫామ్‌సిక్స్ ఫారమ్‌ను అబ్రహం అధికారికి అందచేశారు. బూత్‌లెవెల్ సావిత్రి, శ్రీలత, సుగుణమ్మ, తదితరులు ఉన్నారు.

**డీసీసీ ప్రధాన కార్యదర్శిని సన్మానించిన ఎమ్మెల్యే**

చారకొండ, జనవరి 20: మండల పరిధిలోని జూపల్లి గ్రామానికి చెందిన పాలాది బాలరాజును ఇటీవల డీసీసీ ప్రధాన కార్యదర్శిగా అచ్చంపేట ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ నియమించారు. శనివారం కల్వకుర్తిలో కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీసింగ్‌లు బాలరాజును అభినందించి శాలువా, పూలమాలలతో సన్మానించారు. శేరిఅప్పారెడ్డిపల్లి సర్పంచ్ రంగారెడ్డి, కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గ కిసాన్ సెల్ అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, మణిపాల్ పాల్గొన్నారు.

**ఇసుక డంపు సీజ్**

ఉప్పునుంతల, జనవరి 20: మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకుల ట్రాక్టర్లు ద్వారా అక్రమంగా పెద్దాపూర్ నుంచి దాసర్లపల్లి వెళ్లే మార్గం సమీపంలోని వ్యవసాయ పొలాల్లో అక్రమంగా ఇసుక డంపులు చేశారు. అదే విధంగా గ్రామాల సమీపంలో అక్రమంగా రెండు చోట్ల డంపు చేసిన దాదాపు 50 ట్రిప్పుల డంపులను శనివారం ఆయా పార్టీల నాయకుల ఫిర్యాదు మేరకు తహసీల్దార్ తబితారాణి ఆదేశాల మేరకు ఆర్ఐ సుజాత పెద్దాపూర్‌లో అక్రమ ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా దుందుభీ నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

## దాడి ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు

వెల్దండ, జనవరి 20 : వెల్దండ మండలంలోని గాన్‌గాట్ తండా సర్పంచ్ పత్యానాయక్ అతని భార్య ఉన్నిపై దాడిచేసిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పత్యానాయక్, ఉన్నిలు వ్యవసాయ పొలంలో ఉండగా పాత గొడవల కారణంగా అక్కడికి చేరుకున్న తండాకు చెందిన బక్య, లక్మణ్, మురళిలు కర్రలతో భార్యాభర్తలపై దాడిచేశారు. ఈ మేరకు పత్యానాయక్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.